'ఎబౌ అండ్ బియాండ్' ఆవిష్కరణ



సీఐఎస్ఎఫ్ డీజీ శివ్‌కుమార్ మోహంతా

శంషాబాద్: విమానయాన రంగంలోని సవాళ్లు.. ఎదరయ్యే అనుభవాలు.. మౌలిక సదుపాయాల వంటి అంశాలపై 1500 మంది ప్రయాణికుల సర్వే ఆధారంగా మూడు దశాబ్దాల అనుభవంతో సీఐఎస్ఎఫ్ డీజీ శివ్‌కుమార్ మొహంతా రచించిన పుస్తకం 'ఎబౌ అండ్ బియాండ్' వైమానిక రంగానికి ఎన్‌సైక్లోపిడియా వంటిదని ప్రముఖులు అభిప్రాయపడ్డారు. కేంద్ర వైమానిక శాఖమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా ఢిల్లీలో ఆవిష్కరించిన ఈ పుస్తకంపై సీఐఎస్ఎఫ్ అధికారులు బుధవారం శంషాబాద్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. 445 పేజీలతో రచించిన ఈ పుస్తకం వైమానిక ప్రపంచంలో తెలియని అనేక విషయాలను స్పృశించిందన్నారు. టేకాఫ్, ల్యాండింగ్‌లు, విమానం కోడ్‌ల వెనుక ఉన్న ఆసక్తికరమైన వాస్తవ కథనాలు ఇందులో ఉన్నాయన్నారు. భారత్ వైమానిక వ్యవస్థను ప్రపంచస్థాయికి తీసుకెళ్లడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా విమాన ప్రయాణికులకు ఉపయోగకరమైన అంశాలు పొందుపర్చినట్లు వెల్లడించారు. చెన్నై జ్యురిస్ పబ్లికేషన్ ద్వారా ప్రచురితమైన ఈ పుస్తకం అమెజాన్ వంటి ఆన్‌లైన్ సంస్థతోపాటు ప్రముఖ పుస్తకాల దుకాణాల్లో అందుబాటులో ఉందన్నారు.

మద్యం దుకాణాలకు వంద దరఖాస్తులు

రాజేంద్రనగర్: శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాల ఏర్పాటు కోసం బుధవారం సాయంత్రం వరకు 100 దరఖాస్తులు అందాయని ఇన్‌స్పెక్టర్ దేవేందర్ రావు వెల్లడించారు. శంషాబాద్ స్టేషన్ పరిధిలో గతంలో 35 దుకాణాలకు టెండర్లు పిలవగా.. 4,225 దరఖాస్తులు అందాయన్నారు. ఇదే రాష్ట్రంలోనే అత్యధికంగా దరఖాస్తులు అందిన ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌గా రికార్డు సృష్టించిందన్నారు. ప్రస్తుతం నిర్వహించనున్న మద్యం దుకాణాల టెండర్ల కోసం దరఖాస్తులను ప్రారంభించామన్నారు. బుధవారం సాయంత్రానికి 100 దరఖాస్తులు అందాయన్నారు. గతంలో కంటే ప్రస్తుతం ఐదు దుకాణాలను అధికంగా ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 40 మద్యం దుకాణాలు ఉన్నాయన్నారు. శంషాబాద్, గండిపేట్, రాజేంద్రనగర్ మండలాలలో ఈ దుకాణాలను ఏర్పాటు చేసుకునే సౌకర్యం ఉందన్నారు. టెండర్లలో పాల్గొన దలచిన వారు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను అందించాలన్నారు. దరఖాస్తు చివరి తేదీన వస్తే రద్దీ అధికంగా ఉంటుందని... ముందుగానే దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

అంబేడ్కర్ భవన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలి


కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి

బండ్లగూడ: అంబేడ్కర్ భవన నిర్మాణానికి అధికారులు వెంటనే తగిన నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి కోరారు. హైదర్షాకోట్ గ్రామంలో అంబేడ్కర్ భవన్ నిర్మాణాన్ని అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు చరణ్(బాబీ)తో కలిసి పరిశీలించారు. భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తగిన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కోరడంతో ఆయన స్పందించి నిధులు మంజూరు చేసి త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్రను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాహుల్, సభ్యులు గౌతమ్ రాజ్, అవినాష్, ప్రదీప్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త మహ్మద్ జీవితం ప్రేమ సందేశం

రాయదుర్గం: ప్రవక్త మహ్మద్ జీవితం ప్రేమ సందేశమని ప్రముఖ చరిత్రకారుడు ప్రొఫెసర్ రామ్ పునియాని స్పష్టం చేశారు. మనూలో 'శాంతి, సామరస్యం: ఒక మత దృక్పథం' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సమావేశం నగరంలోని హెన్రీ మార్టిన్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ఇస్లామిక్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ స్నేహభావంతో మెలగాలని సూచించారు. వీసీ ఐనుల్ హసన్ మాట్లాడుతూ విద్య ఐక్యత, మేధో సామరస్యాన్ని ప్రోత్సహించాలన్నారు. అనంతరం 'అంతర్ మత సంభాషణపై దృక్పథాలు' అనే పుస్తకంను విడుదల చేశారు.

అందని వేతనాలు.. తప్పని వెతలు!

ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో దినసరి కార్మికుల గోస

- ఆరు నెలలుగా అందని వేతనాలు
- మరోవైపు పెరిగిన పనిభారం
- కనికరం చూపాలంటూ వేడుకుంటున్న వైనం


శంషాబాద్‌లో ఎస్సీబాలికల వసతి గృహం వద్ద ఆవేదన వ్యక్తం దినసరి కార్మికులు

శంషాబాద్: నెల కాదు.. రెండు నెలలు కాదు ఏకంగా ఆరు నెలలుగా వారి ఖాతాల్లో వేతనాల కింద నయాపైసా జమ కావడం లేదు. పండగలొస్తున్నాయి.. పోతున్నాయి అయినా వారి కష్టార్జితానికి సంబంధించిన పైసలు చెల్లించడంలో ఎస్సీ సంక్షేమ శాఖ నిర్లక్ష్య వైఖరి కారణంగా కార్మికులు పడుతున్న గోస అంతా ఇంతా కాదు.

◆ జిల్లా వ్యాప్తంగా ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో టైమ్ స్కేల్ కింద మొత్తం 20 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో నలుగురు మృతి చెందగా ప్రస్తుతం 16 మంది పనిచేస్తున్నారు. వీరిని క్రమబద్ధీకరించాలనే కోర్టు ఉత్తర్వులున్నా దానిపై కూడా సర్కారు స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరితో పాటు మరో 20 మందికి పైగా కార్మికులు జిల్లా వ్యాప్తంగా దినసరి కార్మికులుగా పనిచేస్తున్నారు.

అందని వేతనాలు...

గడిచిన ఆరుమాసాలుగా ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో టైమ్ స్కేల్ కింద పనిచేస్తున్న కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదు. ఒక్కో కార్మికుడిని టైమ్ స్కేల్ కింద రూ. 22,240 నెలకు ఇవ్వాల్సి ఉంది. ఆరు నెలలుగా జీతాల కోసం వీరు చెప్పులరిగేలా సంబంధిత కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు బిల్లులు క్లియరెన్స్ కాలేదంటూ వారి ఖాతాల్లో నయాపైసా జమచేయడం లేదు. వీరితో పాటు ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారి కూడా ఆరు నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పండగప్పుడూ ఆశగా చూశాం...



టైంస్కేల్‌పై పని చేస్తున్న మాకు ఆరు నెలలుగా మాకు అందాల్సిన వేతనాల్లో ఒక్క పైసా కూడా జమచేయడం లేదు. పండగొలొచ్చినప్పుడైనా ఇస్తారేమోనని ఆశగా ఎదురుచూశాం. దసరా కూడా పస్తులుగానే గడిచింది. దీపావళి లోపు అయినా మాకు అధికారులు వేతనాలు అందించాలి. కేవలం ఎస్సీసంక్షేమ వసతి గృహాల్లో పని చేసే కార్మికులకు మాత్రమే వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారు.

– బుచ్చయ్య, కార్మికుడు

పెరిగిన పనిభారం...

శంషాబాద్ ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో ప్రస్తుతం ఇద్దరు టైంస్కేల్ కార్మికులు ఓ కామాటి మాత్రమే ఉన్నారు. వంట మనిషి, వాచ్‌మెన్‌లు కూడా లేరు. ఈ పరిస్థితి దాదాపు అన్ని సంక్షేమ వసతి గృహాల్లోనూ ఉంది. పర్మనెంట్ పోస్టులు కూడా ప్రభుత్వం నియామకం చేపట్టకపోవడంతో దినసరి కూలీలతో నెట్టుకోస్తోంది. పనిభారం పెంచినా కనీసం వారి శ్రమకు తగిన వేతనం ఇవ్వడంలో అధికారుల అలసత్వం వారి కుటుంబాలకు తీరని వేదనను కలిగిస్తోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ఎడతెరపి లేని వర్షాల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తమై ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శాంతినగర్, వాసవి కాలనీలలో వర్షానికి ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న ఆయన బుధవారం జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పైపులైన్ కోసం కాలనీలో అధికారులతో కలిసి పర్యవేక్షించారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పైపులైన్ వ్యవస్థను మెరుగుపరచాలని అధికారులను అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వీలైనంత త్వరగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్వరగా దగ్గరుండి వర్షపు నీటిని హైడ్రా సిబ్బంది, మాన్‌సూన్ సిబ్బందికి మళ్లించేలా పలు సూచనలు చేశారు. అవసరమైతే హైడ్రా సిబ్బందితో వర్షపు నీటిని తొలగించేలా పనులను వేగవంతం చేయాలన్నారు. డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకోని వస్తే అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. నాయకులు మన్మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ను శంకర్‌రెడ్డి, రఘు, మహమ్మద్, షకీల్, మజర్, అడికే శివ, హనుమంత్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, హరీష్, ఎస్ఎఫ్ఏ జగన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

బండ్లగూడ: స్టాండర్డ్ స్కూల్ గేమ్ ఫౌండేషన్ 69వ గండిపేట మండల స్థాయి సెలక్షన్లు గురువారం ఉంటాయని మండల ఎంపీవో సునీల్‌కుమార్, జోనల్ ఇంచార్జి గంగ్యానాయక్, మండల ఇన్‌చార్జి జ్యోత్స్న తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడల్లో సెలక్షన్స్ ఉంటాయన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని డాన్ బాస్కో పాఠశాలలో ఎంపికలు ఉంటాయని వారు వివరించారు. ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపిక ప్రారంభం అవుతుందన్నారు. ప్రతి పాఠశాలల నుంచి ప్రతి ఈవెంట్‌కు ముగ్గురు క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని వెల్లడించారు. అండర్-14లో పాల్గొనాలనుకునే వారు 1-1-2012 తరువాత జన్మించి ఉండాలి, అండర్-17 పోటీలలో పాల్గొనాలనుకునే వారు 1-1-2009 తరువాత జన్మించి ఉండాలన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు. ఔత్సాహికులు బోనఫైడ్, ఆధార్ జిరాక్స్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వివరాలకు ఫోన్: 94402 31217లో సంప్రదించాలని సూచించారు.

స్వచ్ఛతలో భాగస్వామ్యం కావాలి


చెత్తపాయింట్ ముగ్గులు వేసిన సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లో బుధవారం జీవీపీ ఎలిమినేషన్ పాయింట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది చెత్తను తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ప్రజల అవగాహన కోసం ఇక్కడ చెత్త వేయరాదు అని ముగ్గుతో రాసి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శేఖర్, ఆర్‌పీ కీలుగు హేమలత మాట్లాడుతూ... ప్రజలు స్వచ్ఛత పట్ల చైతన్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇళ్ల వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోల్లోనే చెత్త తడి పొడిగా వేరు చేసి వేయాలన్నారు. సూపర్‌వైజర్ జైప్రకాష్, సివో విజేందర్, ఎస్ఎఫ్ఏ, వర్కర్, ఆర్‌పీలు లక్ష్మీ, స్వర్ణలత, సంధ్యా, ఆశావర్కర్లు రేణుక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు రాయదుర్గం విద్యార్థులు


క్రీడాకారులను సన్మానించిన కరస్పాండెంట్ భరత్‌కుమార్, ప్రిన్సిపల్ సుందరి

రాయదుర్గం: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం వీరిని పాఠశాల కరస్పాండెంట్ భరత్‌కుమార్, ప్రిన్సిపల్ సుందరి అభినందించారు. వీరు ఇటీవల జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి టోర్నమెంట్ జిల్లా సెలక్షన్స్-2025 పోటీలలో అండర్- 17, అండర్-14 విభాగంలో పాల్గొన్నారు. ఈ పోటీలలో భానుతేజ అండర్-17లో బంగారు పతకం, అండర్-14లో చరణ్‌తేజ బంగారు పతకం సాధించారు. వరంగల్‌లో 10,11 తేదీలలో జరగబోయే రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో ఇరువురు పాల్గొనున్నారు.

ఎఫ్‌డీడీఐ-హెచ్‌లో క్రీడోత్సవాలు


ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లో ఫ్యాకల్టీ- స్టూడెంట్స్ వాలీబాల్ జట్టు

రాయదుర్గం: ఇబ్దిటా-2025 కార్యక్రమంలో భాగంగా రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ-హెచ్ క్రీడోత్సవాలు పోటాపోటీగా సాగుతున్నాయి. ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లో సందడి నెలకొంది. బుధవారం ఎఫ్‌డీడీఐ-హెచ్ క్యాంపస్‌లోని క్రికెట్ గ్రౌండ్‌లో ఫ్యాకల్టీ-స్టూడెంట్స్ మధ్య పోటీ నిర్వహించారు. ఇందులో ఫ్యాకల్టీ టీమ్ భారీ విజయాన్ని సాధించింది. 20 ఓవర్లలో ఫ్యాకల్టీ జట్టు 175 పరుగులు సాధించారు. ఈ సందర్భంగా ఈడీ డాక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆటవిడుపు కోసం ప్రతి యేటా ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ ముప్పిడి రాంబాబు, హరిహరన్, డాక్టర్ వికాస్, గౌరబ్‌సింగ్, గోఫ్రాన్, వేణు, నరేష్, సార్థికా, మిశ్రాచ నిరంజన్, పింటూజీ, అంకణ్‌జీ, సుజిత్ రహమాన్, దిలీప్, అభినవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

'ట్రాఫిక్ ఉల్లంఘ'నులను ఉపేక్షించం

శంషాబాద్: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన కఠిన చర్యలుంటాయని శంషాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్ హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు వివిధ ఉల్లంఘనలకు పాల్పడిన 24 మందిని బుధవారం రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపర్చారు. ఇందులో ముగ్గురికి ఒకటి, రెండు మూడు రోజుల చొప్పున వేర్వేరుగా శిక్షను విధించారు. మరో ముగ్గురికి జరిమనాతోపాటు సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా న్యాయమూర్తి ఆదేశించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడిన వారి నుంచి కూడా జరిమానాలు వసూలు చేశారు. మొత్తం రూ. 24 వేలను జరిమానాల రూపంలో వసూలు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి


మృతి చెందిన తౌఫిక్

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ షాక్‌కు గురై ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొగల్స్ కాలనీలో చోటు చేసుకుంది. వివరాలివీ... బిహార్‌కు చెందిన మహ్మద్ హర్షద్ బతుకుదెరువు కోసం తన కుటుంబ సభ్యులతో కలిసి మొగల్స్ కాలనీకి వచ్చి జీవనం సాగిస్తున్నారు. వీరు రేకుల ఇంట్లో ఉంటున్నారు. ఎడతెరపిలేని వర్షాల నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇంట్లోకి వర్షపు నీరు వస్తున్నాయని వారి కుటుంబారు తౌఫిక్(15) బ్యానర్‌ను తీసి ఇంటి రేకులపై కప్పేందుకు యత్నించాడు. ఈ సమయంలో బ్యానర్‌కు ఉన్న ఇనుప రాడ్‌కు కరెంటు ఉండటంతో విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ చార్జీలను తక్షణమే తగ్గించాలి

రాజేంద్రనగర్: ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను పెంచి మెరుగైన సేవలందించాల్సిన సమయంలో చార్జీలు పెంచడం ఏమిటని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి వేముల మల్లేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆర్టీసీ నష్టాల్లో ఉన్నదనే సాకుతో రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. శివరాంపల్లిలోని తన కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల సమయంలో ఉచిత ఆర్టీసీ ప్రయాణ హామీని మహిళలకు ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీని ఒక పక్క నేరవేర్చుతూనే మరో పక్క రూట్ సర్వీసులను రద్దు చేసిందన్నారు. దీంతో నిత్యం ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సర్వీసులను పెంచాలని.. అన్ని ప్రాంతాల నుంచి ఆర్టీసీకి వినతులు వస్తున్నాయన్నారు. వీటిని పట్టించుకోకుండా ఏకపక్షంగా చార్జీలను పెంచడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

నల్లాల్లో నీటి సరఫరా సమయాన్ని పెంచండి


జలమండలి అధికారులను కలిసిన ఫెడరేషన్ నాయకులు

మణికొండ: గండిపేట, సింగూరు డ్యాంల నుంచి నీటిని వృథాగా వదిలేస్తున్నా స్థానికంగా నల్లాలకు నీటి విడుదల సమయాన్ని పెంచి కావాల్సినంత సరఫరా చేయకపోవటం విడ్డూరమని, వెంటనే మరింత సమయం పెంచి నీటిని సరఫరా చేయాలని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు జలమండలి అధికారులను కోరారు. బుధవారం మణికొండలోని జలమండలి డివిజన్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ రామకృష్ణారెడ్డిలను ఫెడరేషన్ అధ్యక్షుడు అర్వపల్లి వంశీ నేతృత్వంలో బృందం కలిసి నీటి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ వ్యాప్తంగా గతంలో మాదిరిగానే 45 నిమిషాలు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారని, దాన్ని 1.15 గంటలకు పెంచాలన్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా గతంలో సర్వే నిర్వహించినా ఇప్పటి వరకు క్యాన్ నెంబర్‌లను మంజూరు చేయలేదని, వాటిని వెంటనే కేటాయించాలన్నారు. రోడ్ల పక్కన ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తే వరద నీటిని సద్వినియోగం చేసి భూగర్భజలాలు పెంచే అవకాశం ఉంటుందని, వాటిని విరివిగా ఏర్పాటు చేయాలన్నారు. అందుకు స్పందించిన జీఎం శ్రీనివాస్‌రెడ్డి రిజర్వాయర్‌ల నుంచి లింక్ పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయని, అవి పూర్తి కాగానే నీటి సరఫరా సమయాన్ని పెంచుతామన్నారు. మణికొండలో మరో 3 ఎంఎల్‌డీ ప్రెజర్ ఫిల్టర్‌ను త్వరలో ఏర్పాటు చేస్తున్నామని దాంతో మరింత నీటిని తీసుకుని సరఫరా చేస్తామన్నారు. క్యాన్ నెంబర్‌లను త్వరలోనే అందరికీ జారీ చేస్తామన్నారు. ఫెడరేషన్ కోశాధికారి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, శంకర్‌దేవ్, వెంకటేశ్వర్‌రావు, బాబురావు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, మహేందర్‌చారి, సంతోష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికులకు ఆర్థిక సాయం


సాయం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ అమ్మ గార్డెన్ సమీపంలో బిల్డింగ్ నిర్మాణ పని చేస్తున్న కార్మికులపై గోడకూలి తీవ్రంగా గాయడపిన కార్మికులకు సీఐటీయూ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. గోడ కూలిన ప్రమాదంలో సునీల్ రామ్ అనే కార్మికుడి తలపైన బలమైన గాయాలయ్యాయి. మరో కార్మికుడు మిథిలేస్ రామ్‌కి స్వల్ప గాయాలయ్యాయి. వీరు బీహార్‌వాసులు. సీఐటీయూ మైలార్‌దేవ్‌పల్లి కన్వీనర్ పి.భాస్కర్, భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చలకూర స్వామి దృష్టికి వారి కష్టాలను తీసుకెళ్లారు. దీంతో బుధవారం కాటేదాన్ సీఐటీయూ ఆఫీస్ వద్దకు ఇంటి ఓనర్ వికాస్‌ని, కాంట్రాక్టర్ బాలుని పిలిపించి చర్చించారు. బాధితుడు సునీల్‌కు రూ. 7 లక్షలు, మరో కార్మికుడు మితిలేష్‌కి రూ. 50 వేల ప్రకారం పరిహారంగా ఇప్పించారు. అలాగే సునీల్ రామ్‌కి కాంట్రాక్టర్ బాలు రూ. 30 వేలను అదనంగా అందించారు. ఇద్దరు కార్మికులకు మొత్తం కలిపి రూ. 7.80 లక్షల నగదు రూపంలో ఇప్పించారు. ఈ సందర్భంగా బచ్చలకూర స్వామి మాట్లాడుతూ... రాష్ట్ర మేదైనా ప్రాంతం ఏదైనా అన్యాయానికి గురైన కార్మికుల కోసం, కార్మిక వర్గం కోసం సీఐటీయూ నిరంతర పోరాటాలు కొనసాగిస్తూ అండగా ఉంటుందన్నారు. శివరాంపల్లి యూనియన్ కార్యదర్శి రేఖ్యానాయక్, తిరుపతి, శివ, శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు


పెద్దషాపూర్ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మణికొండ: పాదచారులు, వాహనదారులతోపాటు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందని నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు అన్నారు. బుధవారం నార్సింగిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ 9వ తరగతి విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకొని వాటిని తప్పక పాటిస్తే రోడ్డు ప్రమాదాలను విజయవంతంగా అరికట్టవచ్చన్నారు. తద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చిని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులకు మై హోం సర్కిల్‌కు తీసుకెళ్లి ట్రాఫిక్‌లో వాహనాల కదలికలు, సిగ్నల్స్ పనితీరును వివరించారు. ఎస్ఐ రాజేశ్‌గౌడ్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దషాపూర్ ఉన్నత పాఠశాలలో...

శంషాబాద్ రూరల్: ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని పెద్దషాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ట్రాఫిక్ పోలీసులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఇతర వాహనదారులు సీటు బెల్టు పెట్టుకునేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలని విద్యార్థులకు సూచించారు. మైనర్లు వాహనాలు నడపవద్దన్నారు. మద్యం సేవించి మత్తులో వాహనం నడిపితే కలిగే అనర్థాలను వివరించారు. రోడ్డుపై నడిచేటప్పుడు పాటించాల్సిన నిబంధనలను సూచించారు.

కాటేదాన్ చౌరస్తాలో సీపీఎం నిరసన



కాటేదాన్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడిని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ తీవ్రంగా ఖండించారు. సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యుడు పి.సి.కె.భాస్కర్ అధ్యక్షతన కాటేదాన్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జస్టిస్ గవాయ్‌పై దాడి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని అభివర్ణించారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా నిందితుడికి తగిన గుణపాఠం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. నాయకులు సచిన్, ప్రవీణ్, బాలరాజు, నర్సింహ, దత్తు, వెంకటేష్‌గౌడ్, శశికాంత్, లక్ష్మణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలకు ప్రయోగశాలలే కీలక వేదికలు

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హిమబిందు

శంషాబాద్: శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించేందుకు చేసే పరిశోధనలకు ప్రయోగశాలలే కీలకమైన వేదికలు అని శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. హిమబిందు అన్నారు. కళాశాలలో బుధవారం జంతు, వృక్ష శాస్త్రాలకు సంబంధించిన ప్రయోగశాలను ఆమె ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సైద్ధాంతిక విజ్ఞానానికి ఆచరణాత్మక విజ్ఞానం కూడా తోడయ్యేందుకు ప్రయోగశాలల అవసరం ఎంతైనా ఉంటుందన్నారు. విద్యార్థులు తమలోని పరిశోధన, ఆవిష్కరణ, సృజనాత్మకతకు వేదికగా ప్రయోగశాలను మలుచుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భానుప్రకాష్, రసాయన శాస్త్ర అధ్యాపకులు దుర్గాభవాని, అధ్యాపకులు వెంకటేష్‌గౌడ్, వెంకటయ్య, నరసింహ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9989616273
9010221230